క్లుప్తంగా

ఉత్తమ సేవలకు సత్కారం



ప్రశంసాపత్రం అందుకుంటున్న మనోజ్‌కుమార్, పురుషోత్తం

పార్వతీపురం టౌన్: విధుల్లో ఉత్తమ సేవలు అందించిన కలెక్టర్ కార్యాలయ సిబ్బందికి గణతంత్ర దినోత్సవం సందర్భంగా అవార్డులు లభించాయి. కలెక్టర్ కార్యాలయం పేషీలో విధులు నిర్వహిస్తున్న మనోజ్ కుమార్, పురుషోత్తంలకు కలెక్టర్ నిషాంత్‌కుమార్, ఎస్పీ విక్రాంత్ పాటిల్ ప్రశంసాపత్రాలు అందజేశారు. వీరిని పలువురు అభినందించారు.

403 మందికి వైద్య సేవలు



చిన్నారులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారిణి

బలిజిపేట: గంగాడలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష 2 వైద్య శిబిరంలో 403 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. గలావల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కంటి పరీక్షల నిమిత్తం 46 మంది హాజరు కాగా పరీక్షలు నిర్వహించి 16 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. అవసరమైన వారికి రక్త పరీక్షలు చేశారు. కార్యక్రమంలో వైద్యులు ఎస్.కోటేశ్వరరావు, ప్రియాంక, సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శ




అశోక్‌కుమార్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న సిరి సహస్ర

సీతానగరం: మండలంలోని బూర్జ గ్రామానికి చెందిన చిన్న శ్రీను సోల్జర్స్ సంస్థ సభ్యుడు సూరిమల్లు అశోక్‌కుమార్ కుటుంబాన్ని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కుమార్తె, చిన్న శ్రీను సోల్జర్స్ సంస్థ జిల్లా అధ్యక్షురాలు సిరి సహస్ర శనివారం పరామర్శించారు. అశోక్‌కుమార్ తండ్రి సత్యనారాయణ ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సిరి సహస్ర వారి కుటుంబాన్ని ఓదార్చి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. ఆమె వెంట ఎంపీటీసీ మాజీ సభ్యురాలు డి.నాగరత్నం, చిన్న శ్రీను సోల్జర్స్ సంస్థల ఉపాధ్యక్షుడు తోట వాసు, కార్యదర్శి జాకీర్ హుస్సేన్ తదితరులు ఉన్నారు.

ఎలక్ట్రికల్ టారిఫ్‌లపై ప్రజాభిప్రాయ సేకరణ రేపు

వీరఘట్టం: ఎలక్ట్రికల్ టారిఫ్‌పై ఈనెల 29న పాలకొండ ట్రాన్స్‌కో ఈఈ కార్యాలయంలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నట్లు వీరఘట్టం ట్రాన్స్‌కో ఏఈ డి.బాలాజీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో వినియోగదారులు పాల్గొని విద్యుత్ చార్జీలు, యూనిట్ ధరలు, తదితర అంశాలపై తమ అభిప్రాయాలు తెలియజేయాలని కోరారు.

పార్టీకి రుణపడి ఉంటా..



మజ్జి జగదీశ్వరరావు

భామిని: వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం జనరల్ సెక్రటరీగా మజ్జి జగదీశ్వరరావు నియమితులయ్యారు. తనకు జిల్లా యువజన విభాగం జనరల్ సెక్రటరీగా అవకాశం కల్పించినందుకు పార్టీ అధిష్టానానికి రుణపడి ఉంటానన్నారు. ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

మహిళా మార్ట్ అభివృద్ధికి సహకరించాలి



మహిళా మార్ట్‌లో సరుకులను పరిశీలిస్తున్న పీడీ కిరణ్‌కుమార్

వీరఘట్టం: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ చేయూత మహిళా మార్ట్‌లో వ్యాపారాభివృద్ధికి డ్వాక్రా సంఘాలు సహకరించాలని డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్ కోరారు. స్థానిక మహిళా మార్ట్‌ను శనివారం ఆయన పరిశీలించారు. ఇంతవరకు రూ.25 లక్షల వ్యాపారం జరిగిందని తెలిపారు. ఇందులో వచ్చే లాభాలు మహిళా సంఘాలకే చెందుతాయని, అందుకే మహిళా సంఘాలన్నీ వ్యాపారాభివృద్ధికి సహకరించాలని కోరారు. ఆయనతో పాటు ఏపీఎం శివున్నాయుడు ఉన్నారు.

సమరానికి 'సిద్ధం'

భీమిలి మండలం సంగివలసలో శనివారం జరిగిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సిద్ధం సభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమర శంఖారావం పూరించారు. సిద్ధం సభలో ప్రతిపక్షాలను కౌరవులతో పోల్చారు. తన పాలనలో ప్రజలకు జరిగిన మేలు సవివరంగా వివరించారు. అన్ని వర్గాల ప్రజలకు జరుగుతున్న మేలును వివరించారు. తన పాలనలో ప్రజలకు మేలు జరిగిందని భావిస్తే మళ్లీ వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. ప్రతిపక్షాల కుట్రలను తిప్పికొట్టాలన్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఎన్నికల సమరానికి సిద్ధం కావాలన్నారు. ప్రభుత్వం చేసిన మేలును ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ సభలకు పార్వతీపురం, సాలూరు నియోజకవర్గాల నుంచి పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు.

– సాక్షి నెట్‌వర్క్



పార్వతీపురం టౌన్: సిద్ధం సభకు పార్వతీపురం నుంచి తరలిన పార్టీ శ్రేణులకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు



సీతానగరం: పెదంకలాం సచివాలయం నుంచి సిద్ధం సభకు వెళ్తున్న పార్టీ నేతలు, కార్యకర్తలు



బలిజిపేట: సిద్ధం సభకు అరసాడ నుంచి బయలుదేరిన నాయకులు, కార్యకర్తలు



బలిజిపేట: వెంగాపురం నుంచి సిద్ధం సభకు వెళ్తున్న పార్టీ శ్రేణులు



సాలూరు: భీమిలి బయలుదేరిన మున్సిపాలిటీకి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు



సీతానగరం: సిద్ధం సభకు లచ్చయ్యపేట నుంచి బయలుదేరిన పార్టీ శ్రేణులు



సీతానగరం: నిడగల్లు నుంచి సిద్ధం సభకు బయలుదేరిన పార్టీ నాయకులు, కార్యకర్తలు



సీతానగరం: సభకు అంటిపేట నుంచి బయలుదేరిన పార్టీ శ్రేణులు

మైనర్లకు వాహనాలిస్తే చర్యలు



పట్టణ పోలీసుస్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌ఐలు

పార్వతీపురం టౌన్: మైనర్లకు వాహనాలు ఇస్తే వాహన యజమానులపై చర్యలు తప్పవని పార్వతీపురం పట్టణ ఎస్‌ఐలు సంతోషి, రవీంద్ర రాజు హెచ్చరించారు. పట్టణంలో మైనర్ డ్రైవింగ్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించి తల్లిదండ్రులకు శనివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ శాతం మైనర్ డ్రైవింగ్ వల్ల జరుగుతున్నట్టు తెలిపారు. మైనర్ డ్రైవింగ్‌పై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి వాహన యజమానులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఎప్పటికప్పుడు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనాలు నడిపేవారిని అదుపులోకి తీసుకొని జరిమానాలు విధించడమే కాకుండా తల్లిదండ్రులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పట్టణ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎనీటైం మోడల్‌తో ఏడాది పొడవునా ఆదాయం



తోటపల్లిలో ఏటీఎం పంటల నమూనాను పరిశీలిస్తున్న డీపీఎం షణ్ముఖరాజు

గరుగుబిల్లి: ఎనీటైం మోడల్(ఏటీఎం) విధానంలో పంటలు సాగుచేయడం ద్వారా లాభాలు పొందవచ్చని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రబంధకులు పి.షణ్ముఖరాజు అన్నారు. మండలంలోని తోటపల్లిలో విశ్రాంత ఉపాధ్యాయులు ఎం.శ్రీరాములుకు చెందిన వ్యవసాయ క్షేత్రంలో ఏటీఎం పద్ధతిలో సాగుచేసిన వంగ, తోటకూర, టమాట, బీర, గోంగూర, ముల్లంగి, పాలకూర, చిక్కుడు, క్యారెట్, బంతి, తదితర పంటలను శనివారం ఆయన పరిశీలించారు. జిల్లాలో 15 మండలాల్లో రైతులు ఏటీఎం విధానంలో పంటలు సాగుచేస్తూ లాభాలు పొందుతున్నారన్నారు. అన్ని రకాల పంటలను సాగు చేయడం వల్ల ఏడాది పొడవునా ఆదాయం వస్తుందన్నారు. రైతులు దీనిపై దృష్టి సారించాలని కోరారు. ఎస్‌ఎఫ్‌ఏ జి.అన్నపూర్ణమ్మ, జి.శ్రీనివాస్, వెంకటనాయుడు, తదితరులున్నారు.

తహసీల్దార్‌కు ఎండీయూ ఆపరేటర్ల వినతి



తహసీల్దార్ రాములమ్మకు వినతిపత్రం అందజేస్తున్న ఎండీయూ ఆపరేటర్లు

గుమ్మలక్ష్మీపురం: ఇంటింటికీ రేషన్ సరుకులు పంపిణీ చేసే ఎండీయూ ఆపరేటర్లు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ జె.రాములమ్మకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎండీయూ ఆపరేటర్ల సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు పత్తిక చిరంజీవి, పెదపెంకి నీలకంఠం మాట్లాడుతూ.. ప్రతి నెలా రేషన్ బియ్యంతో పాటు ఇతర సరుకులను ఒకేమారు ఎండీయూ ఆపరేటర్లకు ఇవ్వకపోవడంతో బియ్యం పంపిణీ ఓసారి, ఇతర సరుకులను మరోసారి లబ్ధిదారులకు పంపిణీ చేయాల్సి వస్తోందన్నారు. దీని వల్ల పనిభారంతో పాటు ఆర్థిక భారం తమపై పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలకు రేషన్ సరుకుల పంపిణీకి సంబంధించిన బిల్లులు విడుదల చేయాలని, ప్రభుత్వ ఆశయాల కోసం పనిచేస్తున్న ఎండీయూ ఆపరేటర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు మూటక కిరణ్, మండంగి శివరాజ్, వి.త్రినాథ్, తోయక ప్రసాద్, తదితరులు ఉన్నారు.

మహిళల కబడ్డీ పోటీల విజేత పాగిరి



జిల్లా స్థాయి పోటీలకు వెళ్లనున్న పాగిరి మహిళల కబడ్డీ జట్టుతో మున్సిపల్ కమిషనర్ నాగరాజు, తదితరులు

రాజాం సిటీ: నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీల్లో మండలంలోని పాగిరి గ్రామ మహిళల కబడ్డీ జట్టు విజేతగా నిలిచిందని మున్సిపల్ కమిషనర్ ఎంవీ నాగరాజు తెలిపారు. శనివారం స్థానిక జీసీఎస్‌ఆర్ కళాశాల మైదానంలో కబడ్డీ, వాలీబాల్ ఫైనల్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో సంతకవిటి మండలంలోని తలంపర జట్టుపై పాగిరి మహిళల కబడ్డీ జట్టు విజయ సాధించగా, రేగిడి జట్టుపై సంతకవిటి మహిళల వాలీబాల్ జట్టు గెలుపొందిందన్నారు. ఆయా జట్లు త్వరలో జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటాయన్నారు.

భగవద్గీత పఠనం మోక్షప్రదం



భగవద్గీత సారాంశం వివరిస్తున్న ఆధ్యాత్మిక వక్త రమణ

రేగిడి: భగవద్గీత పఠనం మోక్ష ప్రదమని పాలకొండ ప్రాంతానికి చెందిన ఆధ్యాత్మిక వక్త ఎన్వీ రమణ అన్నారు. మండలంలోని దేవుదల గీతామందిరంలో గొర్లె దామోదరరావు ఆధ్వర్యంలో దివ్య జీవన సత్సంగ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగవద్గీతను చదివితే జ్ఞానం, సన్మార్గంలో నడిచే అలవాటు పెంపొందుతాయన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనే ప్రతిఒక్కరికీ మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మోహన్‌దాస్, అప్పలరాం, నిత్య స్మరణానందస్వామి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతుల పరిశీలన



శంబాం పోలింగ్ కేంద్రం వద్ద సిబ్బందికి సూచనలిస్తున్న పీఓ కల్పనాకుమారి

సీతంపేట: పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారి అన్నారు. మండలంలోని హడ్డుబంగి, ఉప్పరజమ్మి, శంబాం పోలింగ్ కేంద్రాల్లోని వసతులను శనివారం ఆమె పరిశీలించారు. మరుగుదొడ్లు లేనిచోట వెంటనే నిర్మించాలని సిబ్బందిని ఆదేశించారు. ఇప్పటి కే చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంపులు, విద్యుత్ సౌకర్యం ఉండేలా చూడాలన్నారు. ఆమె వెంట తహసీల్దార్ నరసింహమూర్తి, ఇతర సిబ్బంది ఉన్నారు.

పరశురాంపురంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష'



వృద్ధురాలికి మందులు అందజేస్తున్న వైద్య సిబ్బంది

కొమరాడ: మండలంలోని పరశురాంపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఇందులో భాగంగా వైద్య ఆరోగ్య సిబ్బంది రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు ఉచితంగా అందజేశారు. వైద్య సేవలను ఎంపీడీఓ మల్లికార్జునరావు పర్యవేక్షించారు. గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు సహకారం అందించారు.

విద్యుత్ చార్జీల పెంపుపై ప్రజాభిప్రాయ సేకరణ రేపు

బొబ్బిలి: స్థానిక ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయంలో ఈ నెల 29వ తేదీన విద్యుత్ చార్జీల పెంపుపై ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఆవాల అనంతరావు ఓ ప్రకటనలో శనివారం వెల్లడించారు. ఆరోజు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమంలో వినియోగదారులు తమ అభిప్రాయాలు తెలియజేయాలన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లు 9490610123, 9492666989ను సంప్రదించాలని కోరారు.

అందరి భాగస్వామ్యంతోనే పరిసరాల పరిశుభ్రత

• డీఎంఓ డాక్టర్ జగన్‌మోహన్‌రావు



డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీఎంఓ జగన్‌మోహన్‌రావు

పార్వతీపురం టౌన్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు కోరారు. అడ్డాపుశీల గ్రామాన్ని శనివారం సందర్శించి అక్కడ నిర్వహిస్తున్న డ్రైడే కార్యక్రమాల తీరును పరిశీలించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండడానికి ఆస్కారం ఉన్న, వాడని పాడైపోయిన వస్తువులు, బాటిళ్లు, ఉపయోగంలో లేని కుండీలు తదితర వాటిని పరిశీలించారు. వీధి కాలువల్లో చెత్త వేయడం వల్ల నీరు నిల్వ వుండి దోమల వ్యాప్తికి కారణమవుతాయన్నారు. మన పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంలో ప్రతీ ఒక్కరు భాగస్వామ్యం కావాలని తద్వారా దోమల వ్యాప్తి తగ్గి వ్యాధులు దరి చేరకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చునన్నారు. సిబ్బంది సమన్వయంతో డ్రైడే కార్యక్రమాలను నిర్వహించి, పరిసరాల శుభ్రతపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. దోమల ఆవాస ప్రదేశాలను గుర్తించి సంబంధిత యాప్‌లో వివరాలను సిబ్బంది నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంఓ సూర్యనారాయణ, వైద్య సిబ్బంది శ్రావణి, సంధ్య, ఆశా కార్యకర్తలు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న అడిషనల్ జూనియర్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ సాజన్య

• అడిషనల్ జూనియర్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ సాజన్య

పార్వతీపురం టౌన్: గ్రామస్తులు చట్టాలపై అవగాహన కలిగి వుండాలని అడిషనల్ జూనియర్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ డి.సాజన్య అన్నారు. మండలంలోని నర్సిపురం గ్రామంలో న్యాయ అవగాహన కార్యక్రమాన్ని ఐఅండ్‌పీఆర్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో ప్రతీ పౌరునికి రాజ్యాంగం హక్కులు కల్పించిందని, వాటికి భంగం కలిగినపుడు కోర్టును ఆశ్రయించవచ్చునని తెలిపారు. ప్రజా చైతన్యంతోనే నేరాలు అరికట్టవచ్చునన్నారు. మత్తు పదార్థాలకు, సోషల్ మీడియాకు విద్యార్థులు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ అడ్వకేట్ జోగారావు, ఐఆర్‌పీడబ్ల్యూఏ డైరెక్టర్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ల ప్రారంభం



మాట్లాడుతున్న తహసీల్దార్ రమణ

సీతానగరం: రాష్ట్ర ప్రభుత్వం జగనన్న కాలనీల్లో పేదలకు పంపిణీ చేసిన ఇళ్ల పట్టాలకు సంబంధించి రిజిస్ట్రేషన్లు శనివారం నుంచి ప్రారంభమైనట్టు తహసీల్దార్ ఎన్వీ రమణ అన్నారు. మండల తహసీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు ప్రారంభించిన తరువాత ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో పేదలను గుర్తించి ఇళ్ల స్థలాలు సమకూర్చడంతో పాటు పక్కా ఇళ్లను మంజూరు చేసినట్టు తెలిపారు. ఇళ్ల నిర్మాణాలు కొన్ని ప్రాంతాల్లో పూర్తయ్యాయని, మరికొన్ని చోట్ల నిర్మాణంలో ఉన్నాయని పేర్కొన్నారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలతో సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయాలని వీఆర్‌ఓలకు ఆదేశించామన్నారు. రీసర్వే డీటీ చిట్టెమ్మ, ఆర్‌ఐ ఎన్.శ్రీనివాసరావు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

పోలీసులకు సమాచారం ఇవ్వాలి



గ్రామపెద్దలతో మాట్లాడుతున్న ఎస్సై ప్రసాద్

భామిని: గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలు జరిగితే గ్రామ పెద్దలు వెంటనే స్పందించి పోలీసులకు సమాచారం ఇవ్వాలని బత్తిలి ఎస్సై చిట్టిపోలు ప్రసాద్ కోరారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌లో భాగంగా మండలంలోని పసుకుడి గ్రామస్తులతో శనివారం సమావేశమయ్యారు. చిన్న చిన్న సమస్యలపై వివాదాలకు పోకుండా గ్రామస్థాయిలోనే పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రతీ గ్రామంలో చిన్నచిన్న సమస్యలు ఉంటాయని, వాటిని స్నేహపూర్వక వాతావరణంలో పరిష్కరించుకోవాలన్నారు. పసుకుడి, సింగిడి గ్రామ పెద్దలు, యువకులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.